అమెరికాకు అడుగులు ఇలా!

భారత్‌లో యూజీ (బీటెక్).. యూఎస్‌లో పీజీ (ఎంఎస్).. ఇదీ నేటి యువతరం క్రేజీ ధోరణి! ఉత్తమ బోధన, విస్తృత అవకాశాలు, గరిష్ఠ వేతనాలు, ప్రపంచ ప్రమాణాలు, మేటి సౌకర్యాలు, సామాజిక హోదా.. ఇవన్నీ అమెరికా దిశగా అడుగులేయిస్తున్నాయి. అగ్ర రాజ్యంలో చదవాలనే ఆకాంక్ష తెలుగు రాష్ట్రాల విద్యార్థుల్లో ఏటా బాగా పెరుగుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహమూ లభిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికాలోని మేటి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశానికి ఏ అంశాలు ప్రామాణికమో తెలుసుకుందామా...



15 నెలల ప్రణాళికతో..

డిగ్రీ (బీటెక్) పూర్తికాగానే యూఎస్ వెళ్ళి చదువుకోవాలంటే బీటెక్ మూడో సంవత్సరంలో ఉన్నప్పుడే సన్నాహాలు ప్రారంభించాలి. ఈ సమయంలో జీఆర్ఈ, టోఫెల్‌ల సన్నద్ధతకు కేటాయించాలి. నాలుగో సంవత్సరం కోర్సులో ఉన్నప్పుడు జూన్ నుంచి విదేశీ విద్యకు ప్రణాళిక రూపొందించుకోవాలి.

జులై: జీఆర్ఈ, టోఫెల్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడం, వాటిని రాయడం

ఆగస్టు: పరీక్షల్లో సాధించిన స్కోరు ప్రకారం అందుకు తగ్గ విశ్వవిద్యాలయాల జాబితా రూపొందించుకోవాలి.

సెప్టెంబరు: ఎస్ఓపీ, వ్యాసాలు, రికమెండేషన్ లెటర్లు పకడ్బందీగా సిద్ధం చేసుకోవాలి.

అక్టోబరు: దరఖాస్తుల తుది మెరుగులకు కేటాయించాలి.

నవంబరు, డిసెంబరు, జనవరి: ఫాల్ దరఖాస్తులకు గడువు ముగుస్తుంది. ప్రాధాన్యం ప్రకారం ఒక్కో సంస్థకు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి.

ఫిబ్రవరి, మార్చి: దరఖాస్తు చేసుకున్న సంస్థల నుంచి సీటుకు సంబంధించిన వర్తమానం అందుతుంది.

ఏప్రిల్, మే: డబ్బుకోసం ఏర్పాట్లు చేసుకోవాలి. స్కాలర్‌షిప్పులకు దరఖాస్తు చేసుకోవడం, విద్యారుణాలు పొందడం లాంటివి పూర్తిచేసుకోవాలి.

జూన్: స్టూడెంట్ వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

జులై: విదేశీయానం కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లూ పూర్తి కావాలి.

ఆగస్టు/ సెప్టెంబరు: అమెరికాలోని కోరిన సంస్థలో కాలుమోపేది ఇప్పుడే. ఫాల్ సీజన్ ప్రారంభం

స్కోరు సరిపోదు

ఏ సంస్థ సర్వే నిర్వహించినప్పటికీ ప్రపంచంలోని టాప్-10, టాప్-200, టాప్-500 విశ్వవిద్యాలయాల జాబితాలో అగ్ర రాజ్యానిదే ఆధిపత్యం. సగం కంటే ఎక్కువ సంస్థలు ఈ దేశం నుంచే ఉంటాయి. అందుకే మనవాళ్లు అమెరికాలో చదవడానికీ, స్థిరపడటానికీ ప్రాధాన్యమిస్తున్నారు. ఆ దేశం ఆకర్షిస్తోన్న విదేశీ విద్యార్థుల్లో ప్రథమ స్థానం మన దేశానిదే. వారిలో సుమారు 21 శాతం భారతీయులే. ఏటా 2 లక్షల కంటే ఎక్కువమంది మన దేశం నుంచి చదువుల నిమిత్తం వెళ్తున్నారు. వీరిలో సింహభాగం.. న్యూయార్క్, కాలిఫోర్నియా, టెక్సాస్, ఇల్లినాయిస్, మసాచ్యుసెట్స్‌లో విద్య అభ్యసిస్తున్నారు. ఇక్కడి విద్యాసంస్థలకూ, పరిశ్రమలకూ మధ్య సమన్వయం ఉండటమే దీనికి కారణం.

మన దగ్గర జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుంటే ఐఐటీలో చేరిపోవచ్చు. నీట్‌లో మెరిసి ఎంబీబీఎస్ చదువుకోవచ్చు. గేట్ రాసి ఎంటెక్ పూర్తిచేయొచ్చు. కానీ విదేశాల్లో ముఖ్యంగా అమెరికాలో ఎంఎస్ చదవాలంటే.. జీఆర్ఈ స్కోరు ఒక్కటే సరిపోదు. టోఫెల్ లేదా ఐఈఎల్‌టీఎస్‌తో పాటు మరెన్నో ప్రామాణికాలను అక్కడి విశ్వవిద్యాలయాలు పరిగణనలోకి తీసుకుంటాయి. ఇందుకోసం స్థిరమైన విధానమంటూ ఉండదు. ఒక్కో విద్యాసంస్థ ఒక్కో పద్ధతిని పాటిస్తుంది. అవి విద్యార్థుల ఎంపికలో వైవిధ్యాన్ని అనుసరిస్తాయి. వాళ్ల ఆలోచనలు ఎలా ఉన్నాయి? కోర్సులో చేరిన తర్వాత ఒత్తిడిని తట్టుకుని, విజయవంతంగా పూర్తిచేయగలుగుతారా? లేదా? అంచనా వేస్తారు. దరఖాస్తులను పూర్తిగా విశ్లేషిస్తారు. వాళ్లు యూజీ పూర్తిచేసుకున్న విద్యాసంస్థల పేరు ప్రఖ్యాతులు, గత తరగతుల్లో చూపిన ప్రతిభనూ గమనిస్తారు. ప్రవేశానికి అవకాశం కల్పిస్తే.. విశ్వవిద్యాలయ దృక్పథాన్ని తెలుసుకోగలరా, దాని నుంచి నేర్చుకుని అభివృద్ధి చెందగలరా, నేర్చుకున్న, ఆర్జించిన దాన్నుంచి కొంతైనా సమాజానికి ఇచ్చే స్వభావం ఏ మేరకు ఉంది.. ఇవన్నీ బేరీజు వేసుకునే ప్రవేశం కల్పిస్తారు.

సంస్థల ఎంపిక

అమెరికాలో దాదాపు 4000 విద్యా సంస్థలు ఉన్నాయి. వాటిలో ఎందులో చేరాలి, మన స్కోరుకు ఏది అనువైనది, చేరాలనుకున్న కోర్సులో ఏవి ఉత్తమ సంస్థలో తెలుసుకోవడానికి కొంత కసరత్తు చేయాలి. క్యూఎస్, టైమ్స్.. తదితర సంస్థలు విడుదల చేసిన ర్యాంకుల జాబితాను పరిశీలించి, నిర్ణయించుకోవచ్చు.

ముందు ఏ కోర్సులో చేరాలో కచ్చితమైన నిర్ణయానికి రావాలి. ఆ కోర్సుకు సంబంధించి పరిశ్రమలు/ సంస్థలు ఎక్కువగా ఎక్కడ ఉన్నాయో పరిశీలించాలి. అవకాశం బట్టి ఆ ప్రాంతంలోని విద్యాసంస్థల్లో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వవచ్చు. తెలిసినవారు చెప్పారని చేరిపోవడం, ఏమాత్రం అవగాహన లేకుండా నిర్ణయం తీసుకుంటే నష్టపోతారు. విద్యాసంస్థలను.. అవి ఉన్న ప్రాంతం, అక్కడ వాతావరణ పరిస్థితులు, ఉద్యోగ అవకాశాలు, ఖర్చులు.. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుని ఎంచుకోవాలి. సీటు వస్తే తప్పకుండా చేరతాను అని నిర్ణయించుకున్న సంస్థలనే ఎంచుకోవాలి. చేరాలనుకున్న కళాశాలకు సంబంధించి ఇంటర్నెట్ ద్వారా ఎంతో సమాచారం లభిస్తుంది. ఆ కళాశాలలకు వివిధ ర్యాంకింగ్ సంస్థలు ఇస్తోన్న రేటింగ్ గమనించవచ్చు.

నచ్చిన సంస్థలన్నింటికీ దరఖాస్తు చేస్తే సమయం, పెద్ద మొత్తంలో డబ్బులూ వృథా. మీ స్కోరు ప్రకారం 10-15 సంస్థల జాబితా ముందుగా సిద్ధం చేసుకోవాలి. వీటిలో డ్రీమ్ సంస్థలు 4 ఉండాలి. అంటే సీటు వచ్చే అవకాశాలు పరిమితంగా ఉన్నవి. అలాఅని తక్కువ స్కోరు ఉన్నప్పటికీ స్టాన్‌ఫర్డ్, హార్వర్డ్, యేల్ లాంటివి ఎంచుకోవడం వల్ల ఉపయోగం లేదు. మీ జీఆర్ఈ స్కోరు, అకడమిక్ సీజీపీఏలకు అనుగుణంగా దరిదాపుల్లో ఉన్న సంస్థలనే ఎంచుకోవాలి. టార్గెట్ సంస్థలు 4 ఉండాలి. వీటిలో సీటు రావడానికి 40 శాతం అవకాశం ఉంటుంది. 2 లేదా 3 సేఫ్టీ సంస్థలు అంటే సీటు రావడానికి 75 శాతం అవకాశం ఉన్నవి ఉండాలి.

ఎక్కువమంది విద్యార్థులు ప్రవేశాలకు గడువు తేదీ సమీపిస్తున్నప్పుడు తొందర పడతారు. ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశాలు కొంచెం ఎక్కువగా ఉంటాయి. గడువు తేదీకి కనీసం నెల రోజుల ముందైనా దరఖాస్తు చేసుకోవాలి. ఎస్ఓపీ రాయడానికి 4 వారాలు కేటాయించుకోవాలి. ఆ తర్వాత విడిగా సంస్థల వారీ ఎస్ఓపీ కోసం కనీసం 3-4 రోజులైనా అవసరమవుతాయి. రికమెండేషన్ లెటర్లు, సపోర్టు డాక్యుమెంట్లు మొదలైనవన్నీ ముందే సిద్ధం చేసుకోవాలి.

ఇవీ గమనిస్తారు..

విద్యార్థులు ఎంచుకున్న కోర్సుపై దృష్టి సారిస్తారు. అది చదవడానికి సరైనవాళ్లేనా, అందులో రాణించగలరా అనేవి తెలుసుకుంటారు. ఉదాహరణకు.. ఇంజినీరింగ్ కోర్సుల్లో సీటు ఆశించే విద్యార్థుల నుంచి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో వారి దృక్పథాన్ని చూస్తారు. ఈ సబ్జెక్టుల్లో మంచి గ్రేడ్‌లు లేదా గతం నుంచి ఇప్పటివరకు చూసినప్పుడు మెరుగుదల కనిపించాలి. విద్యార్థులు కళాశాలల్లో సాధించిన మార్కులు, కరిక్యులమ్ స్థాయి, అడ్మిషన్ టెస్టులో ప్రతిభ, వివిధ స్టాండర్డ్ పరీక్షల్లో సాధించిన స్కోర్లు చూస్తారు. అకడమిక్‌తోపాటు ఇంకా ఏమైనా అంశాల్లో ప్రతిభ పొందితే అందుకు సంబంధించిన సర్టిఫికెట్లనూ పరిశీలిస్తారు. ఆ కోర్సుకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరిలోనూ ఉమ్మడిగా కాకుండా విడిగా ఏమైనా ప్రత్యేకతలు ఉంటే వాటికే ప్రాధాన్యం లభిస్తుంది.

రికమెండేషన్ లెటర్లు: ప్రవేశాల్లో ముఖ్యమైనవి, ప్రాధాన్యమున్నవీ- రికమెండేషన్ లెటర్లు. అందువల్ల ఇవి మామూలుగా ఉంటే ఉపయోగం ఉండదు. మీ గురించి బాగా తెలిసినవారు, మీ ప్రత్యేకతలు, నైపుణ్యాలు ప్రభావపంతంగా చెప్పగలిగేవారి నుంచి వీటిని పొందాలి. వారికి హోదా, గుర్తింపు ఉంటే మంచిది. ఇలాంటి వారిని మెంటర్‌గా ఎంచుకుని, ఈ లెటర్లు పొందాలి. ఒక వ్యక్తిగా మీరు ఎలాంటివారు, పాటిస్తున్న విలువలు, మీలోని బలాలు, నైపుణ్యాలు, సమర్థత ఇవన్నీ అందులో స్పృశించాలి. ప్రవేశం పొందాలనుకున్న విద్యా సంస్థను అనుసరించి రెండు లేదా మూడు రికమెండేషన్ లెటర్లు ఉండాలి.



ఎక్స్‌ట్రా అంశాలు: విదేశీ విద్యాసంస్థలు ఎక్స్‌ట్రా కరిక్యులర్ అంశాలకు అధిక ప్రాధాన్యమిస్తాయి. ప్రతి కళాశాలలోనూ స్పోర్ట్స్, మ్యూజిక్, ఎడిటోరియల్, డిబేట్, వాలంటీర్... ఇలా పలు బృందాలు ఉంటాయి. వీటన్నింటి సమూహంతోనే అక్కడి తరగతులు రూపొందుతాయి. అందువల్ల ప్రవేశాల్లో వీటిని గమనిస్తారు. వేటిపై ఆసక్తి ఉంది, అనుభవం ఎలాంటిదో చూస్తారు. అందువల్ల యూజీలో ఉన్నప్పుడే ఏదైనా అంశంలో ఆసక్తి ఏర్పరచుకోవడం, అందులో రాణించడం మంచిది. ప్రవేశంలో అది ఉపయోగపడుతుంది. మేటి విశ్వవిద్యాలయాలు ప్రవేశాల్లో.. సమతౌల్యానికీ, హోలిస్టిక్ అప్రోచ్‌కూ ప్రాధాన్యమిస్తున్నాయి.

నాయకత్వ లక్షణాలు: ప్రతి సంస్థా మంచి విద్యార్థులనే కోరుకుంటుంది. అలాగే వాళ్లు మేటి పౌరులుగా ఉండాలని ఆశిస్తాయి. వారి నుంచి సమాజానికి మంచి జరగాలని కోరుకుంటాయి. అందువల్ల నాయకత్వ లక్షణాలు పెంపొందించే కార్యక్రమాలు, సంఘాభివృద్ధికి ఉపయోగపడే పనులు చేపట్టినవారికి ప్రవేశాల్లో సహజంగానే ప్రాధాన్యమిస్తారు. అలాగని.. ప్రవేశానికి ముందు ఇలాంటి కొన్ని కార్యక్రమాలు హడావిడిగా పూర్తిచేసి, వాటి గురించి చెప్పి లబ్ధి పొందడాన్ని మేటి విద్యాసంస్థలు పట్టించుకోవు. కొన్నేళ్లగా మీ తపన, మీరు అందులో చూపుతోన్న చొరవతోపాటు జరిగిన మంచి (ప్రగతి)ని గమనించి, అంచనాకు వస్తాయి.

వ్యాసాలు, సమాధానాలు: మీరు సాధించిన గ్రేడ్‌లు/స్కోర్లకు కొంత ప్రాధాన్యముంటుంది. లెటర్ ఆఫ్ రికమెండేషన్లు కొంత అవగాహన తెప్పిస్తాయి. అయితే మీ గురించి తెలుసుకోవడానికి మీరు రాసే వ్యాసం చాలా కీలకం. దీనిద్వారా మీరెలాంటివారో అంచనాకు వస్తారు. మీరు రాసిన వ్యాసంలో మీ లక్ష్యాలు, ఆశయాలు, విలువలు చూస్తారు. ఈ రోజు మీరు ఇలా ఉండడానికి ఏ అంశాలు ప్రభావితం చేశాయో గమనిస్తారు. కొన్ని విద్యా సంస్థలు ఏదైనా అంశం/ అంశాల్లో వ్యాసం రాయమని అడగవచ్చు. మరికొన్ని మీకు నచ్చిన అంశంలో రాయమనవచ్చు. ఈ వ్యాసాలు 1 నుంచి 3 వరకు ఉంటాయి.

వైవిధ్యం: మేటి సంస్థలు వైవిధ్యమైన విద్యార్థుల సమూహాన్ని తరగతి గది నుంచి ఆశిస్తాయి. ప్రతి విద్యార్థి ఎవరికి వారే ప్రత్యేకంగా ఉండాలని కోరుకుంటాయి. అందువల్ల మీలో ప్రత్యేకతలు గుర్తించి, వాటిలో మీ ప్రతిభను చూపితే ప్రవేశానికి అవకాశం ఉంటుంది. మీరు రాసిన ఎస్ఓపీ మీకు మాత్రమే ప్రత్యేకం కావాలి. అందులోని అంశాలు మీ ఆసక్తులు, ఆలోచనలను ప్రతిబింబించాలి. ఉన్నత చదువులు, భవిష్యత్తుపై మీ తపనను తెలిపేలా ఉండాలి. దీన్ని నిశితంగా గమనిస్తారు. ఇంటర్నెట్ నుంచి కాపీ చేస్తే సీటు దక్కదు. కొన్ని సంస్థలు బయోడేటా లేదా సీవీ కూడా అడగొచ్చు. ఈ వివరాలు వాస్తవికంగా, సహజంగా ఉండాలి. వీటిలో మీ హృదయాన్ని ఆవిష్కరించాలి. దరఖాస్తు, ఎస్ఓపీల ద్వారా ఆంగ్లభాష నైపుణ్యాన్నీ గమనిస్తారు. కోర్సు ఫీ, ఇతర ఖర్చులు భరించగలిగే స్థాయిలో ఉన్నారా లేదా పరిశీలిస్తారు. పని అనుభవం ఉంటే కొంత ప్రాధాన్యం దక్కుతుంది.

ప్రయత్నిస్తూ ఉంటేనే ఫలితం

'అందివచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఫలితాలు వాటంతటవే వస్తాయి' అంటోంది హైదరాబాద్‌లోని బీవీఆర్ఐటీ విద్యార్థిని జ్యోతిరెడ్డి. మైక్రోసాఫ్ట్ సంస్థ ఇటీవల జరిపిన నియామకాల్లో ఏడాదికి రూ.52 లక్షల ప్యాకేజీతో ఎంపికైన ఆమె.. ఇందు కోసం తనెలా సన్నద్ధమైందో మనతో ఇలా పంచుకుంటోంది..!

మైక్రోసాఫ్ట్ సంస్థకు ఎంపికైన జ్యోతిరెడ్డి | రూ.52 లక్షల వార్షిక ప్యాకేజీ

- పచ్చిన ప్రతి ఆఫర్‌కూ దరఖాస్తు చేయాలి. ప్రతిచోటా ప్రయత్నించడం, మరింత మెరుగుపరుచుకోవడమే మన విధి.
- కేవలం ఒక్క డొమైన్‌నే నేర్చుకుని ఊరుకోకుండా మొత్తం అన్ని డొమైన్స్ పైనా అవగాహన పెంచుకోవడం అవసరం.

మాది హైదరాబాద్‌లోని నిజాంపేట. పదోతరగతిలో 90 శాతం, ఇంటర్‌లో 95 శాతం మార్కులు సాధించాను. ఎంసెట్‌లో 4800 ర్యాంకు రావడంతో మొదటి కౌన్సెలింగ్‌లోనే బీవీఆర్ఐటీ విమెన్స్ కాలేజీలో సీఎస్‌సీ ఏఐ-ఎంఎల్ సీటు దొరికింది. కేవలం సీఎస్‌సీ కాకుండా ఏఐ-ఎంఎల్ కూడా ఉంటే మెరుగైన అవకాశాలు పొందవచ్చనే ఉద్దేశంతో అందులో చేరాను. అయితే మా బ్యాచ్‌కు మొదటి రెండు సంవత్సరాలు కొవిడ్ వల్ల క్లాసులు వర్చువల్‌గానే జరిగాయి. అది కొంచెం ఇబ్బందే అయినా ఆ సమయాన్నీ, సందర్భాన్నీ కెరియర్‌కు పునాది వేసుకునేలా ఉపయోగించుకున్నాను. వివిధ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు నేర్చుకోవడం, ఉద్యోగ ప్రకటనలు వెలువడినప్పుడు దరఖాస్తు చేయడం, ప్రొఫైల్‌ను ఇంకా మెరుగుపరుచుకోవడం.. ఇవన్నీ బీటెక్‌లో చేరిన నాటి నుంచే ప్రారంభించాను.

ఇంజినీరింగ్ రెండో ఏడాదిలో ఉన్నప్పుడు మైక్రోసాఫ్ట్ యంగ్‌ఏజ్ ప్రోగ్రామ్ గురించి మా అధ్యాపకుల ద్వారా తెలిసింది. మంచి అవకాశం కావడంతో దానికి దరఖాస్తు చేశాను. దీని ద్వారా ఎంపిక చేసిన విద్యార్థులకు మైక్రోసాఫ్ట్ కంపెనీ ఉద్యోగుల మెంటర్‌షిప్ లభిస్తుంది. వారి ఆధ్వర్యంలో విద్యార్థులు ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ ప్రాజెక్టు నచ్చితే కంపెనీ తరపున ఇంటర్న్‌షిప్‌కి ఎంపిక చేస్తారు. అక్కడా మంచి ప్రదర్శన కనబరిస్తే నేరుగా ఉద్యోగంలోకి తీసుకుంటారు. నేను అలా మూడో ఏడాదిలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యాను. ఇప్పుడు ఉద్యోగం కూడా దక్కింది.

యువతులకు ప్రోత్సాహం

సాఫ్ట్‌వేర్ రంగంలో యువతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో టాలెంట్ స్ప్రెడ్ అనే సంస్థ 'విమెన్ ఇంజినీర్స్' అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ చదువుతున్న యువతులను దరఖాస్తు, ప్రాథమిక పరీక్షల తర్వాత కోర్సుకు ఎంపిక చేస్తారు. మొత్తంమీద 200 నుంచి 300 మందినే తీసుకుంటారు. టాప్ 50 స్టూడెంట్స్‌కు 100 శాతం స్కాలర్‌షిప్ సైతం లభిస్తుంది. కాలేజీ అధ్యాపకుల సూచన మేరకు దరఖాస్తు చేశాను. వెంటనే ఎంపిక కావడంతో పాటు టాప్‌గా నిలవడంతో పూర్తిగా ఉచితంగా కోర్సు పూర్తిచేశాను. రెండేళ్లపాటు డిగ్రీతో సమాంతరంగా ఈ తరగతులు ఆన్‌లైన్‌లో జరిగేవి. ఇలా బోధించేవారంతా అమెజాన్, గూగుల్ వంటి ఉన్నతశ్రేణి కంపెనీల్లో పని చేసి వచ్చినవారే కావడంతో కాలేజీలో చెప్పేదానికి అదనంగా పరిశ్రమ గురించి లోతుగా ఇందులో తెలుసుకునే వీలు కలిగింది. రెండేళ్ల ఈ మెంటర్‌షిప్ పూర్తి చేసినట్టుగా వచ్చిన సర్టిఫికేషన్ రెజ్యూమెను మరింత ఆసక్తికరంగా మలచడంలో ఉపయోగపడింది.

తొలి ఏడాది నుంచే...

- **మొదటి సంవత్సరం నుంచే వెబ్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్ వంటి కొన్ని సర్టిఫికేషన్ కోర్సులు చేస్తూ వచ్చా. అకడమిక్స్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, సెల్ఫ్ లెర్నింగ్.. అన్నింటినీ బ్యాలెన్స్ చేసుకోవాలి. చాలా మంది విద్యార్థులను చూస్తుంటా.. ఏదైనా జాబ్ ఓపెనింగ్స్ ఉన్నప్పుడు 'మాకు పూర్తిగా స్కిల్స్ లేవు, సెలక్ట్ అవుతామో లేదో' అని సందేహిస్తూ దరఖాస్తు చేయడానికి వెనకాడుతుంటారు. కానీ అది సరైన పద్ధతి కాదు. మొదటి రెండేళ్లు విద్యార్థుల నుంచి కంపెనీలు కనీస నైపుణ్యాలు మాత్రమే ఆశిస్తాయి. వారు పూర్తిగా సిద్ధం కాలేదన్న విషయం వాటికే తెలుసు. అయితే ఆ రెండేళ్లూ మంచి మార్కులు తెచ్చుకునేందుకు కచ్చితంగా ప్రయత్నించాలి. కనీసం 8- 9 మధ్య సీజీపీఏ ఉంటే.. తర్వాత రెండేళ్లు ఎటూ స్టూడెంట్స్ ఇంటర్న్‌షిప్స్, ఇంటర్వ్యూలతో బిజీగా ఉండటం వల్ల మార్కులు తగ్గినా కంపెనీలు పట్టించుకోవు. కానీ మొత్తంగా 8 పైన సీజీపీఏ ఉండేలా ప్రయత్నించాలి.**
- **వీలైనన్ని ఎక్కువ అప్లికేషన్లు పెట్టడం చాలా అవసరం. ఒక దరఖాస్తు పెట్టడం వల్ల మహా అయితే రిజెక్ట్ అవుతాం అంతే.. కానీ ఆ ప్రక్రియలో మనం చాలా నేర్చుకునే వీలుంటుంది. రెజ్యూమె ఎలా ఉండాలి, ముఖాముఖిలో ఎలాంటి ప్రశ్నలు ఎదురవుతాయి, మనం ఏ అంశాల్లో బలహీనంగా ఉన్నాం, ఇంకా ఏం నేర్చుకోవాలి, పోటీ ఎలా ఉంది.. ఇవన్నీ తెలిసేది అక్కడే. అందువల్ల పచ్చిన ప్రతి ఆఫర్‌కూ దరఖాస్తు చేయాలి. మనలో ఏం ఉంది, ఏం లేదు అనేది కంపెనీ చూసుకుంటుంది. ప్రతిచోటా ప్రయత్నించడం, మరింత మెరుగుపరుచుకోవడమే మన విధి.**
- **ఇంటర్వ్యూలో రెజ్యూమె ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఏ కంపెనీకి దరఖాస్తు చేస్తున్నా దాని అవసరాలకు తగినట్టుగా మన వద్ద ఉన్న నైపుణ్యాలను హైలైట్ చేస్తూ ఉండాలి. చేసిన ప్రోగ్రామ్స్, సర్టిఫికేషన్స్, ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్స్ అన్నీ వివరంగా ఇవ్వాలి. అభ్యర్థికి నైపుణ్యాలతోపాటు సరైన ఆలోచనా ధోరణి ఉందా లేదా అనేది కంపెనీలు ప్రధానంగా గమనిస్తాయి.**
- **కెరియర్‌కు సంబంధించి కొన్ని మంచి యూట్యూబ్ చానెళ్లు ఉన్నాయి. వాటిని చూసి కొత్త విషయాలు నేర్చుకున్నా. డైనమిక్ ప్రోగ్రామింగ్‌కి 'అబ్దుల్‌బరి', సీ ప్లస్ ప్లస్‌కి 'అప్‌నా కాలేజ్', 'గేట్ స్మాషర్స్' వంటి వన్నీ చూస్తూ వచ్చాను.**
- **కేవలం ఒక్క డొమైన్‌నే నేర్చుకుని ఊరుకోకుండా మొత్తం అన్ని డొమైన్స్ గురించి అవగాహన పెంచుకోవడం అవసరం.**
- **నాకు వచ్చే ఏడాది జులైలో పోస్టింగ్ ఇస్తారు. హైదరాబాద్, నోయిడా, బెంగళూరులో ఎక్కడైనా ఇవ్వొచ్చు. రెండేళ్లు పని చేశాక మాస్టర్స్ లేదా ఎంబీఏ చేద్దాం అనుకుంటున్నా. ఎంబీఏ చేస్తే మేనేజర్ హోదాలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. అందుకే అలా అనుకుంటున్నా.**

ఉద్యోగం అవసరమే కానీ..

ఒక్కోసారి మనం అనుకున్నవి నెరవేరకపోవచ్చు. నేను కూడా గూగుల్, వీసా వంటి కంపెనీల వద్ద విఫలమయ్యా. అలా అని అదే పనిగా ఒత్తిడి తీసుకోవడం సరికాదు. రోజులో కొంత సమయాన్ని దీని కోసం కేటాయించడం ముఖ్యం. తర్వాత రిలాక్స్ అయ్యేందుకు నచ్చిన పని చేయాలి. కుటుంబంతో ఎక్కువ సమయం గడపడం, వాకింగ్‌కు వెళ్లడం వంటివి చేశా. నిజానికి ఇప్పుడు బయట జాబ్ మార్కెట్ కొంచెం క్లిష్టంగా ఉన్న మాట వాస్తవమే. అయినా మన ప్రయత్నం మనం చేస్తూ మెరుగుపరుచుకుంటూ ఉంటే తప్పకుండా విజయం సాధించగలం!

సేల్స్ కాకుండా ఏ విభాగాలు మేలు?

ఎంబీఏ ఫైనాన్స్ చదివి ఐసీఐసీఐ రిటైల్ బ్యాంకింగ్‌లో పనిచేస్తున్నాను. సేల్స్‌లో కాకుండా ఇతర ఏ విభాగాల్లో పనిచేస్తే భవిష్యత్తు బాగుంటుంది? - రోహిత్‌కృష్ణ



■ బ్యాంకులో ఫైనాన్స్‌కు సంబంధించిన విభాగాల్లో పనిచేసినట్లయితే మీరు ఎంబీఏలో చదివిన ఫైనాన్స్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఐసీఐసీఐ బ్యాంకులో ఉన్న వివిధ రకాల విభాగాలన్నీ పరిశీలించి, వాటిలో ఫైనాన్స్ సంబంధిత రంగాలను ఎంచుకొని అందుకు తగిన నైపుణ్యాలను పెంపొందించుకోండి. సాధారణంగా బ్యాంకుల్లో ఫైనాన్స్‌కి సంబంధించి కార్పొరేట్ క్రెడిట్, రిటైల్ క్రెడిట్, ట్రెజరీ, ఫారెక్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్, డిజిటల్ బ్యాంకింగ్ లాంటి విభాగాలుంటాయి. ఏ విభాగంలో పనిచేస్తే మంచి భవిష్యత్ ఉంటుంది అని అడిగారు. మీ దృష్టిలో మంచి భవిష్యత్తు అంటే ఎక్కువ వేతనం పొందడమా? పదోన్నతా? చేసే ఉద్యోగంలో సంతృప్తా? అనే విషయాలపై స్పష్టత అవసరం. మీ దీర్ఘకాలిక, స్వల్పకాలిక ఆశయాలను దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నోటిఫికేషన్స్

ప్రవేశాలు

తేజ్‌పూర్ వర్సిటీలో ఎంబీఏ

అసోం రాష్ట్రం తేజ్‌పూర్‌లోని తేజ్‌పూర్ యూనివర్సిటీ 2024 విద్యా సంవత్సరానికి ఎంబీఏ (ఎగ్జిక్యూటివ్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: కనీసం 50% మార్కులతో ఏదైనా విభాగంలో (ఫైన్ ఆర్ట్స్ మినహా) బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు అయిదేళ్ల పని అనుభవం ఉండాలి.
ఎంపిక: అకడమిక్ రికార్డులు, పని అనుభవం, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్, పర్సనల్ ఇంటరాక్షన్ తదితరాల ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20-12-2023.
వెబ్‌సైట్: https://www.tezu.ernet.in/

పీహెచ్‌డీ ప్రోగ్రామ్

తేజ్‌పూర్ యూనివర్సిటీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం విశ్వేశ్వరయ్య పీహెచ్‌డీ స్కీములో భాగంగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఎంఈ, ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ ఐటీ/ ఎలక్ట్రానిక్స్) లేదా ఎంసీఏ/ ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్/ ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. **పరిశోధనాంశాలు:** అల్గారిథమ్స్, కంప్యూటర్ విజన్ అండ్ ఇమేజ్ అనాలిసిస్, కంప్యుటేషనల్ జామెట్రీ, నెట్‌వర్క్ అనాలిసిస్.
ఎంపిక: అకడమిక్ రికార్డులు, పర్సనల్ ఇంటరాక్షన్ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13-10-2023.
షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల వివరాల వెల్లడి: 17-10-2023
ఇంటర్వ్యూ తేదీ: 31-10-2023
వెబ్‌సైట్: https://www.tezu.ernet.in/

ఐఐటీ హైదరాబాద్‌లో ..

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీహెచ్), ఫిజిక్స్ విభాగం పీహెచ్‌డీ ప్రోగ్రామ్ (స్పెషల్ రౌండ్)లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
అర్హత: పీజీ (ఫిజిక్స్)తో పాటు యూజీసీ- జేఆర్ఎఫ్/ సీఎస్ఐఆర్-జేఆర్ఎఫ్/ డీఎస్టీ- ఇన్‌స్పైర్ అర్హత సాధించి ఉండాలి.
ఎంపిక: షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్/ దివ్యాంగులకు రూ.250.
గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: 15-10-2023.
వెబ్‌సైట్: https://www.iith.ac.in/careers/

వాక్-ఇన్

ఆర్ఏఆర్ఎస్, మారుటేరులో..

మారుటేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కాంట్రాక్ట్/ తాత్కాలిక ప్రాతిపదికన 4 టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
● టీచింగ్ అసోసియేట్: 01 ● టీచింగ్ అసిస్టెంట్: 03
అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ, బీటెక్,